సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ၊ 21 ၊ ఆగస్టు ၊ 2023



ఆమె గాత్రం 'సరళ'ం

ధర్మవరానికి చెందిన సోమిశెట్టి సరళ రచయితగా.. జానపద గాయనిగా.. విశేషంగా రాణిస్తున్నారు.

8లో



టమాట కిలో రూ.33

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.33 పలికింది. కనిష్టంగా రూ.16, సరాసరి రూ.25 చొప్పున విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
36.2°/22.5°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

తుంగభద్ర జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ఈ నెల ఒకటో తేదీన ఇన్‌ఫ్లో 40 వేల క్యూసెక్కులు ఉండగా ఆదివారం నాటికి 706 క్యూసెక్కులకు పడిపోయింది. శివమొగ్గ, మలెనాడు, ఆగుంబే, తీర్థనహళ్లి, శృంగేరి, వరనాడు, చిక్కమంగళూరు తదితర డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో 1,633 అడుగులతో 105.788 టీఎంసీల పూర్తి స్థాయి మట్టానికి గాను ఆదివారం నాటికి 1,627.54 అడుగులతో 85.113 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంకు ఇన్‌ఫ్లో 706 క్యూసెక్కులు ఉండగా.. అవుట్‌ఫ్లో 10,207 క్యూసెక్కులు ఉంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,285 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

కోమాలోనే డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.సాయిరామ్ ఇంకా కోమాలోనే ఉన్నారు. 72 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉండాలని బెంగళూరు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శనివారం సాయంత్రం అపస్మారక స్థితిలోకి వెళ్లిన డీఈఓకు అనంతపురంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అర్ధరాత్రి బెంగళూరులోని ఆస్టర్ సీఎంఐ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం అనంతపురం డిప్యూటీ డీఈఓ, అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు పలువురు ఎంఈఓలు, సమగ్ర శిక్ష కార్యాలయ ఉద్యోగులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది బెంగళూరుకు వెళ్లారు. డీఈఓకు చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడారు. గుండె, బ్రెయిన్‌కు రక్తం సరఫరా చేసే కొన్ని వాల్వ్‌లు బ్లాక్ అయినట్లు వైద్యులు గుర్తించారు. గతంలోనే ఇందుకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేయించుకున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం కోమాలో ఉన్నా చికిత్సకు సహకరిస్తున్నట్లు తెలిసింది.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పందన సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాతో పాటు డివిజన్, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సమస్యలపై తనకు నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చని, సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

వైఎస్సార్‌సీపీకే మద్దతు



బత్తలపల్లిలో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

'పంచాయతీ ఉపపోరు'లో అధికార పార్టీ సత్తా

- 28 వార్డులు, సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నికలు
- పది వార్డుల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ మద్దతుదారులు
- మరో ఆరు వార్డుల్లో విజయదుందుభి
- చలివెందుల పంచాయతీలో ఘన విజయం
- టీడీపీ ప్రలోభాలకు లొంగని ఓటర్లు



సర్పంచ్ ఉపేంద్ర రెడ్డి

సాక్షి, పుట్టపర్తి: పంచాయతీ, వార్డుల ఉప ఎన్నికల్లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. టీడీపీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ఓటర్లు లొంగలేదు. 'సంక్షేమ' ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులకు అండగా నిలిచారు. జిల్లా వ్యాప్తంగా 28 వార్డులు, ఒక పంచాయతీ సర్పంచ్ స్థానానికి నోటిఫికేషన్ రాగా.. అందులో 15 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 10 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎలాంటి పోటీ లేకుండా ఎన్నికయ్యారు. 13 వార్డులు, సర్పంచ్ స్థానానికి ఈనెల 19న పోలింగ్ జరిగింది. అందులో ఆరు వార్డులు, సర్పంచ్ స్థానంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు జయకేతనం ఎగురవేశారు. మిగిలిన వార్డుల్లో నామమాత్రపు ఓట్లతో టీడీపీ సానుభూతిపరులు గట్టెక్కారు.

చలివెందులలో తిరుగులేని మెజారిటీ

హిందూపురం మండలం చలివెందుల పంచాయతీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఉపేంద్ర రెడ్డి ఘన విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి రవీంద్రారెడ్డిపై 337 ఓట్ల మెజారిటీతో విజయదుందుభి మోగించారు. పంచాయతీలో 2,514 ఓట్లు ఉండగా.. ఉపేంద్రరెడ్డికి 1,185 ఓట్లు వచ్చాయి. రవీంద్రారెడ్డికి 848 మాత్రమే పడ్డాయి. ఈ పంచాయతీలో గతంలో సౌభాగ్యమ్మ గెలిచారు. ఆమె అకాల మరణంతో ఆమె తనయుడు ఉపేంద్ర రెడ్డి బరిలో దిగి సునాయాసంగా విజయం సాధించారు.



సరోజమ్మ, లక్ష్మీదేవి, లీలావతి, సుజాత, అలివేలమ్మ, దివాకర్‌రెడ్డి, వన్నూర్ లింగప్ప, బి.శ్రీనివాసులు, సయ్యద్ మౌలానాసాబ్, రంగప్ప

వార్డు స్థానాల్లో ఏకగ్రీవమైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల వివరాలు

మండలం	పంచాయతీ/వార్డు	అభ్యర్థి పేరు
అగళి	పి.బ్యాడిగెర/3	రంగప్ప
చెన్నేకొత్తపల్లి	గంగినేపల్లి తండా/1	శ్రీనివాసులు
చెన్నేకొత్తపల్లి	న్యామద్దుల/6	సరోజమ్మ
చిలమత్తూరు	మరుసలపల్లి/4	లక్ష్మీదేవి
లేపాక్షి	కోడిపల్లి/2	అలివేలమ్మ
ముదిగుబ్బ	ఈదులపల్లి/3	వన్నూర్ లింగప్ప
సోమందేపల్లి	బ్రాహ్మణపల్లి/3	సుజాత
సోమందేపల్లి	మండ్లి/9	లీలావతి
తాడిమర్రి	కునుకుంట/4	దివాకర్‌రెడ్డి
తనకల్లు	తవళం/6	సయ్యద్ మౌలానాసాబ్

వార్డు ఎన్నికల్లో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల వివరాలు

మండలం	పంచాయతీ/వార్డు	అభ్యర్థి పేరు
గాండ్లపెంట	బూనాన్‌చెరువుపల్లి/9	డి.విజయమ్మ
సోమందేపల్లి	బ్రహ్మసముద్రం/2	వెట్టి కంబళప్ప
బుక్కపట్నం	కృష్ణాపురం/7	మంజుల
అమడగూరు	అమడగూరు/11	నారాయణస్వామి
గోరంట్ల	గోరంట్ల/18	ఎర్రమ్మ
బత్తలపల్లి	తంబాపురం/3	బ్యాళ్ల లక్ష్మీనారాయణమ్మ

టీడీపీ ప్రలోభాలు పటాపంచలు

ఇంటికే సంక్షేమ పథకాలు అందుతుండడం, పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుండడం వెరసి ఇప్పటికే టీడీపీకి ప్రజల నుంచి మద్దతు కరువైంది. ఆ పార్టీ నాయకులకు ఎక్కడ చూసినా చీత్కారాలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే పంచాయతీ ఉప ఎన్నికలు రావడంతో ఎలాగైనా గెలిచి ఉనికి చాటాలని తెలుగుదేశం పార్టీ నాయకులు దొడ్డిదారి ప్రయత్నాలు ముమ్మరంగా చేశారు. డబ్బు ఆశచూపి అభ్యర్థులను మభ్యపెట్టారు. దీంతో నల్లచెరువు మండలం మడ్డిమడుగు పంచాయతీ మూడో వార్డునుంచి పుంగనూరు లక్ష్మీదేవి వైఎస్సార్ సీపీ మద్దతుతో నామినేషన్ వేసి తర్వాత టీడీపీలో చేరారు. ఇదే మండలం పి.కొత్తపల్లి పంచాయతీ పదో వార్డులో జెరిపిటి వాసుదేవ వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ వేసి టీడీపీలో చేరారు. పరిగి మండలం హొన్నంపల్లి పంచాయతీ పదో వార్డు నుంచి కె.హనుమయ్య వైఎస్సార్‌సీపీ మద్దతుతో నామినేషన్ వేసిన తర్వాత టీడీపీ గూటికి చేరారు. నామినేషన్ సమర్పించిన తర్వాత వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు డబ్బు ఎరగా చూపి టీడీపీ నాయకులు తమ వైపు తిప్పుకొన్నారు. అయితే, వీరి కుటిల యత్నాలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. పోటీ చేసే ధైర్యం లేక చాలా చోట్ల నామినేషన్ కూడా వేయలేదంటే టీడీపీ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఎన్నికల్లో గెలుపొందిన వార్డు సభ్యులు



డి.విజయమ్మ, వెట్టి కంబళప్ప, మందల మంజుల, నారాయణస్వామి, ఎర్రమ్మగారి నరసింహప్ప, బ్యాళ్ల లక్ష్మీనారాయణమ్మ

గోల్‌మాల్‌పై విజిలెన్స్ విచారణ పూర్తి!

- త్వరలో ప్రభుత్వానికి నివేదిక



మడకశిర: నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జరిగిన సిమెంట్ గోల్‌మాల్‌పై విజిలెన్స్ విచారణ పూర్తి అయినట్లు సమాచారం. త్వరలోనే విచారణ నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలుస్తోంది. దాదాపు 3 నెలల పాటు విజిలెన్స్ బృందం ఈ అంశంపై విచారణ చేసింది. నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. పీఆర్ పరిధిలో జరిగిన ప్రతి పనినీ తనిఖీ చేసి ఎంత మేర సిమెంట్ వినియోగించారో లెక్కలేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లను కూడా విచారించారు. ఏఏ పనికి ఎన్ని బస్తాల సిమెంట్ ఇచ్చారో తెలుసుకున్నారు. పీఆర్ శాఖకు ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్ బస్తాల వివరాలను కూడా సంబంధిత ఉన్నతాధికారుల నుంచి తెలుసుకున్నారు. విచారణ పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

సిమెంట్ గోల్‌మాల్ నేపథ్యమిదీ...

మడకశిర పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 2019 నుంచి 2022 వరకు దాదాపు 800 అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం 2 లక్షల బస్తాలకు పైగా సిమెంట్ సరఫరా చేసినా, తమకు సక్రమంగా అందక కాంట్రాక్టర్లు పనులను వేగవంతంగా చేయలేకపోయారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే తిప్పేస్వామి అధికారులతో సమీక్ష నిర్వహించగా.. సిమెంట్ బస్తాల గోల్‌మాల్ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. వెంటనే ఎమ్మెల్యే అప్పటి పీఆర్ డీఈ, ఏఈలపై ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దాదాపు 90 వేల బస్తాల సిమెంట్ గోల్‌మాల్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించి డీఈ, ముగ్గురు ఏఈలను సస్పెండ్ చేసింది. దీనిపై లోతుగా విచారణ చేయడానికి విజిలెన్స్ విభాగానికి అప్పగించింది.

'ఈ-పంట'.. మేలంట!

- ఖరీఫ్ ఈ-క్రాప్ నమోదు ప్రారంభం
- జియో ఫెన్సింగ్ సిస్టం ద్వారా ప్రక్రియ
- సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తికి చర్యలు
- ప్రత్యామ్నాయ పంటల వివరాలూ సేకరణ



బ్రాహ్మణపల్లిలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే రైతులకు మేలు చేయడంలో సంజీవినిలా పనిచేసే ఈ-క్రాప్ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. ఈ-క్రాప్‌తో పంట వివరం, విస్తీర్ణం పక్కాగా తెలుస్తాయి. దీంతో పంట నష్టపోతే పరిహారం ఇవ్వడం, గిట్టుబాటు ధరలు లేకపోతే మద్దతు ధరతో దిగుబడులు కొనుగోలు చేయడానికి ఇబ్బంది ఉండదు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ-క్రాప్ ఈ సారి పక్కాగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 15వ తేదీ ప్రారంభమైన ఈ-క్రాప్ నమోదు జిల్లాలో సెప్టెంబర్ నెలాఖరు వరకూ జరగనుంది.

ప్రత్యామ్నాయ పంటలూ..

జిల్లా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.23 లక్షల హెక్టార్లు కాగా, వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండటంతో ఈ సారి 86 వేల హెక్టార్లలోనే వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. దీంతో అధికారులు ఈ పంటలన్నీ ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలు ఇప్పుడిప్పుడే సాగులోకి వస్తుండగా వాటన్నింటినీ సెప్టెంబర్ నెలాఖరులోపు ఈ-క్రాప్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. నమోదు చేసిన పంటల వివరాలకు ఈ-కేవైసీ తీసుకోవడం, అధికారుల పరిశీలన అనంతరం రైతులకు డిజిటల్, మ్యాన్యువల్ రసీదులు అందజేయాల్సి ఉంది.

జియో ఫెన్సింగ్‌తో ఫొటోలు

గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఈ-క్రాప్ చేసే అధికారులు ప్రతి రైతు పొలంలోకి వెళ్లి ఫొటోలు తీసే జియోఫెన్సింగ్ ప్రక్రియను అమల్లోకి తెచ్చారు. ఈ ఏడాది వెబ్‌ల్యాండ్ డేటా లింకుతో ఎన్ఐసీ సహకారంతో జియో ఫెన్సింగ్ యాప్‌ను రూపొందించారు. దీంతో ఎంపిక చేసుకున్న రైతు పొలంలోని ప్రతి సర్వే నంబర్‌నూ యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటారు. అనంతరం ఫొటో తీయాల్సి ఉంటుంది. ఒకేచోట కూర్చుని వివరాలు నమోదు చేసేందుకు ప్రయత్నిస్తే సర్వే నంబర్లు డౌన్‌లోడ్ కావని అధికారులు చెబుతున్నారు.

కౌలు రైతుల వివరాలు సైతం..

గత ఏడాదిలాగే ఈసారి వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పంట వివరాలు నమోదు చేస్తే ఆ డేటా వీఆర్‌ఓలు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆ వివరాలు మండల వ్యవసాయ అధికారికి అక్కడి నుంచి తహసీల్దార్ లాగిన్‌కు వెళ్తాయి. వెబ్‌ల్యాండ్ డేటాను ప్రామాణికంగా తీసుకోవడంతో పొరపాట్లకు తావులేకుండా ఉండే అవకాశం ఉంది. వెబ్‌ల్యాండ్‌లో ప్రతి సర్వే నంబర్‌కూ రైతు ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటుంది. ఈ-కర్షక్ యాప్‌తో ఆర్బీకేలు, రెవెన్యూ గ్రామాలను మ్యాపింగ్ చేశారు. ఇందులో రైతు ఆధార్ నంబర్ నమోదు చేయగానే భూమి వివరాలు ప్రత్యక్షమవుతాయి. సాగు వివరాలు నమోదు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పంట తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. కౌలు రైతుల వివరాలు సైతం యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

ఇన్‌పుట్ సబ్సిడీ అందింది



గత ఖరీఫ్‌లో నేను 9 ఎకరాల్లో కందిపంట సాగు చేశా. ఆర్బీకే సిబ్బంది పొలం వద్దకే వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. వర్షాలు అధికమై పంటనష్టం జరిగింది. దీంతో ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.98 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ చేసింది. రైతులంతా తాము సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ చేయించాలి.

– లక్ష్మీనరసింహారెడ్డి, చిన్నకోట్ల, ముదిగుబ్బ

ఈ-క్రాప్ నమోదు చేయించాలి



పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ -క్రాప్ చేయించుకోవాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు రూపాయి కూడా ఖర్చు చేయనవసరం లేదు. గత ఏడాది వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలకు పరిహారం అందింది. ఈ సారి ప్రత్యామ్నాయ పంటలూ ఈ-క్రాప్ చేస్తాం.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయ అధికారి



భగవద్ దర్శనం నాటిక ప్రదర్శిస్తున్న శ్రీకాకుళం జిల్లా కళాకారులు

మహిమాన్వితం.. సాయిరామ చరితం



నాటికలో ఓ ఘట్టం



భక్తులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న రత్నాకర్

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆధ్యాత్మిక వైభవాన్ని కళ్లకు కడుతూ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన భక్తులను మైమరపించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు రెండో రోజు ఆదివారం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్ దర్శనం పేరుతో నాటిక నిర్వహించారు. మానవాళిని సత్యసాయి సన్మార్గంలో నడిపిన తీరును అత్యద్భుతంగా ప్రదర్శించారు. మహిమాన్విత ఘట్టాలను కళ్లకు కట్టారు. శ్రీరామచంద్రుడే సత్యసాయిగా అవతరించి ప్రజలను ఆశీర్వదించాడని వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కళాకారులకు సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి నూతన వస్త్రాలు బహూకరించారు.

గ్రూప్ -1లో మెరిసిన గిరిజన బిడ్డ



శివకుమార్‌నాయక్

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం నారసింపల్లి తండాకు చెందిన గుండావత్ శివకుమార్‌నాయక్ గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన చెన్నకేశవ నాయక్, నారాయణమ్మలకు మూడో సంతానంగా జన్మించిన ఆయన.. అదే గ్రామంలోని పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. పదో తరగతిని పెనుకొండలో పూర్తి చేశారు. పేదరికంలో మగ్గుతూనే డీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ పట్టభద్రుడయ్యారు. చదువులు పూర్తి కాగానే రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు సిద్ధమవుతూ వచ్చారు. ఈ క్రమంలో గ్రూప్ -1 పరీక్షల్లో సత్తా చాటి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యారు.

క్లుప్తంగా

వివాహిత మిస్సింగ్ కేసు ఛేదింపు



తల్లిదండ్రులకు శైలజాదేవిని అప్పగిస్తున్న పోలీసులు

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన వివాహిత మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. గత శుక్రవారం తన ఇద్దరు పిల్లలతో కలసి శైలజాదేవి అదృశ్యమైన విషయం తెలిసిందే. భర్త రవితో గొడవపడిన ఆమె గురువారం ఉదయం పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కియా పోలీసులకు ఆమె తండ్రి శ్రీరాములు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో మిస్సింగ్ కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చిన్నారులతో కలసి తచ్చాడుతున్న శైలజాదేవిని పోలీసులు గుర్తించి, ఆదివారం పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు పిలుచుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి, అప్పగించారు.

'సౌత్ జోన్'కు ముగ్గురి ఎంపిక



బి.అనూష



అర్షియా



భావనారెడ్డి

అనంతపురం: ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకూ మంగళగిరిలో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సీనియర్ ఉమెన్ అంతర్ జోన్ మ్యాచ్‌లకు సౌత్ జోన్ జట్టులో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు దక్కింది. వీరిలో భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యురాలు బి.అనూష, కదిరికి చెందిన ఎస్.అర్షియా, కె.భావనారెడ్డి ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి అభినందించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



మృతుడు బాలకృష్ణ

హిందూపురం అర్బన్: మండలంలోని పూలకుంట చెరువులో ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ (35) నీట మునిగి మృతి చెందాడు. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ సురేష్ తెలిపిన మేరకు... చేపల వల విసిరే సమయంలో బురదలో చిక్కుకున్న ఆయన బయటకు వచ్చే క్రమంలో క్రమంగా అందులోనే కూరుకుపోయి మృతి చెందాడు. చివరకు ఫైర్ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆమె గాత్రం 'సరళ'ం

- జానపద గాయనిగా రాణిస్తున్న సరళ
- డీడీఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు
- వందలాది అవార్డులు సొంతం



కువైట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రతిభా అవార్డు అందుకుంటున్న సరళ (ఫైల్)



సాధించిన అవార్డులు, పురస్కారాలతో సరళ

ధర్మవరం అర్బన్: రచయితగా.. జానపద గాయనిగా.. తన గాత్రంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది ధర్మవరానికి చెందిన సోమిశెట్టి సరళ. వందలాది బహుమతులు, అవార్డులు, పురస్కారాలు సొంతం చేసుకున్న ఆమె ప్రసారభారతి జానపద సంగీతం విభాగంలో 'ఏ' గ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకుంది. ధర్మవరానికి చెందిన విశ్రాంత ఎస్‌ఐ రామయ్య (స్వర్గీయ), శారద దంపతుల కుమార్తె సరళకు చిన్నప్పటి నుంచి పాటలు పాడడమంటే ఎంతో ఆసక్తి. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహిస్తూ వచ్చారు. సినీ నేపథ్య గాయనిగా ఉంటూనే జానపద గాయనిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమెను తమళనాడుకు చెందిన తెలుగు కళాసమితి వారు గాన కోకిల బిరుదుతో సత్కరించారు.

లలిత సంగీతం, డ్రామాల కేటగిరిలో బీ గ్రేడ్

దాదాపు వెయ్యికి పైగా వేదికలపై తన గాత్రంతో కళాభిమానుల హృదయాలను గెలుచుకున్న సరళ.. ఎన్నో పాటల పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచింది. గాయనిగా, రచయితగా, సినీ నేపథ్య గాయకురాలిగా, లఘు చిత్రాల దర్శకురాలిగా, కల్చరల్ కో ఆర్డినేటర్‌గా విభిన్న అంశాల్లో తనదైన ప్రతిభను చాటుకుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రసార భారతి కార్యక్రమాల్లో లలిత సంగీతం, డ్రామాల విభాగంలో బీ గ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకుంది. నిరంతర పరిశోధనలతో 'స్త్రీల శ్రామిక గీతాలు- శ్రమజీవన సౌందర్యం' అనే పుస్తకం రచించారు. సినీ నేపథ్య గాయకురాలిగా ఇప్పటి వరకూ ఐదు సినిమాల్లో పాటలు పాడారు.

డీడీఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు

అజాదీకా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలు తిరిగి స్వాతంత్ర యోధుల వారసులు, నాటి సంఘటనల ప్రదేశాలు, స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసిన కళాకారులు, పాటలు, బ్రిటీష్ వారితో నిషేధించబడిన నాటకాలు, తదితరాలను సేకరించారు. వీటన్నింటినీ క్రోడీకరిస్తూ 337 కథలను వెలువరించారు. దేశంలో అత్యధిక కథలు పంపిన వ్యక్తిగా గుర్తించిన కేంద్రం ప్రభుత్వం.. ఈ ఏడాది మార్చి 25న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డీడీఆర్ ప్రాజెక్టుకు బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తిస్తూ సత్కరించింది.

దక్కించుకున్న అవార్డులు ఇవే..

- 1993లో హోసూరు తెలుగు కళా సమితి వారు జానపద కోకిల బిరుదు ప్రదానం చేశారు.
- 1998లో ఈ–టీవీ పాడుతాతీయగా కార్యక్రమంలో సినీ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకుంది.
- 2002లో ఈ–టీవీ ఆంధ్రావాలా ప్రూవ్ యువర్ టాలెంట్ కార్యక్రమంలో అవార్డు అందుకుంది.
- 2002లో ఏపీఎస్‌ఆర్టీసీ 29వ ఉత్సవాల్లో ఉత్తమ గాయని అవార్డును అప్పటి అనంతపురం జిల్లా కలెక్టర్ సోమేష్‌కుమార్ చేతులమీదుగా అందుకుంది.
- 2002లో అనంతపురంలో లలిత కళాపరిషత్ నిర్వాహకులు ఉగాది పురస్కారంతో సత్కరించారు.
- 2003లో పెనుకొండలో సాహితీ గగన్ మహల్ వారు అనంత ఆణి ముత్యం పురస్కారంతో సత్కరించారు.
- 2008లో అప్పటి ఆర్థికమంత్రి కొణిజేటి రోశయ్య చేతులమీదుగా ఉత్తమ జానపద గాయకురాలిగా అవార్డు అందుకుంది.
- 2010–2012లో రాయలసీమ కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో ఉత్తమ జానపద గాయనిగా అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, కేంద్ర మంత్రి టీజీ వెంకటేష్ చేతుల మీదుగా సత్కారం అందుకుంది.
- 2010లో రాష్ట్ర సాంస్కృతిక శాఖ, దూరదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన జానపద ప్రసార ఉత్సవాల్లో ఉత్తమ కల్చరల్ కో ఆర్డినేటర్ అవార్డు అందుకుంది.
- 2011లో ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నన్నపనేని రాజ్యలక్ష్మి జానపద పురస్కారం అందుకుంది.
- 2011లో దక్షిణ భారతదేశ జానపద సంగీతంలో జూనియర్ ఫెలోషిప్ అవార్డును న్యూఢిల్లీ మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ వారు అందించారు.
- 2016లో కృష్ణా పుష్కరాల్లో భాగంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో అప్పటి స్పీకర్ మండలి బుద్ధాప్రసాద్ చేతులమీదుగా ఉత్తమ జానపద గాయని అవార్డు అందుకుంది.
- 2016, 2018లో కువైట్‌లో జరిగిన అంతర్జాతీయ జానపద ప్రతిభా ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలుగు కళాసమితి సత్కారం అందుకున్నారు.
- 2018లో విశ్వసాహితి సమితి ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ కవయిత్రి అవార్డును దక్కించుకున్నారు.

జానపదానికి ప్రపంచ గుర్తింపు తీసుకువస్తా..

నేపథ్య గాయనిగా, రచయితగా, జానపద గాయనిగా వేలాది కార్యక్రమాలు నిర్వహించా. వందలాది అవార్డులు, బహుమతులు, పురస్కారాలు అందుకున్నా. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నా. జానపద సంగీతానికి ప్రపంచ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

– సోమిశెట్టి సరళ, గాయని, ధర్మవరం

డీజిల్ షెడ్ ఉద్యోగి దుర్మరణం

- రైలింజన్‌లో పనిచేస్తుండగా ఘటన
- ప్రైషర్ ఫ్యాన్‌లో చిక్కుకుని ముక్కలైన దేహం



శాంతిరామ్ (ఫైల్)

గుంతకల్లు: రైలింజన్‌లో మరమ్మతులు చేస్తూ ప్రమాదం చోటు చేసుకుని ఓ ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న శాంతిరామ్ (50)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డీజిల్ షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న శాంతిరామ్ ఆదివారం విధుల్లో భాగంగా రైలింజన్‌లోని ప్రెషర్ ఫ్యాన్‌కు రబ్బరు మార్చే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ విషయం తెలియని మరో ఉద్యోగి అనిల్ (బిహార్) రైలింజన్‌ను ఆన్ చేశాడు. దీంతో ప్రెషర్ ఫ్యాన్‌లో చిక్కుకుని శాంతిరామ్ దేహం ముక్కలు ముక్కలైంది. విషయం తెలుసుకున్న షెడ్ ఉద్యోగులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ మంగాచార్యులు, ఇతర అధికారులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం శాంతిరామ్ మృతదేహం అవశేషాలను పోస్టమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దుర్ఘటనపై గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

నిబంధనలు పాటించకపోవడం వల్లనేనా?

శాంతిరామ్ దుర్ఘటన వెనుక నిబంధనలు పాటించకపోవడమే కారణంగా తెలుస్తోంది. వాస్తవానికి రైలింజన్ కంప్రెషన్ రూమ్‌లో మరమ్మతులు చేస్తున్నప్పుడు కార్మికులు కొన్ని నిబంధనలు తప్పక పాటించాలి. రైలింజన్ మరమ్మతులు చేసే సమయంలో ఇంజన్ ఆన్ చేయకూడదంటూ ఓ బోర్డు పెట్టాలి. అనంతరం ఆన్ చేసే ముందు 'సంభాలో.. సంభాలో (జాగ్రత్త.. జాగ్రత్త)' అంటూ రైలింజన్ చుట్టూ తిరుగుతూ గట్టిగా కేకలు వేసి అప్రమత్తం చేసి, సైరన్ మోగించాలి. అయితే ఇద్దరూ టెక్నీషియన్లు ఈ నింబంధనలు పాటించారా లేదా అనే విషయమై అధికారులు విచారణ చేపట్టారు.

జగతికి ఆదర్శప్రాయుడు వాల్మీకి



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: యావత్ జగతికి వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి ఆదివారం రాప్తాడులో ఆదివారం జరిగిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విశేష పూజలు నిర్వహించి, విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని చాటి చెప్పిన వాల్మీకి జీవితం ఎంతో గొప్పదన్నారు. రామాయణం వంటి సుందరమైన కావ్యాన్ని రచించి జగతికి ఆదర్శ ప్రాయుడయ్యారన్నారు. అంతకు ముందు గ్రామంలో జ్యోతుల ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యువతులు, మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వాల్మీకి మహర్షి విగ్రహం వద్దకు చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు కాంట్రాక్టర్ రాముడు, సాకే చంద్ర, కేశవయ్య, వెంకటరాముడు, జయన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య



భూమిక (ఫైల్)



మృతురాలు నస్రీన్

రొద్దం/ధర్మవరం అర్బన్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులిద్దరూ 20 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. పోలీసులు తెలిపిన మేరకు...

- రొద్దం మండలం బొమ్మిరెడ్డిపల్లికి చెందిన రామాంజిన రెడ్డి కుమార్తె భూమిక (20) హైదరాబాద్‌లోని కళాశాలలో ఏంసీఏ సీటు వచ్చింది. అయితే అక్కడికెళ్లి చదువుకునేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం రాత్రి ఇంట్లోనే ఫైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని కుటుంబసభ్యులు గుర్తించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, భూమిక మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఆమె మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై ఆరా తీశారు. బాధిత కుటంబసభ్యులను ఓదార్చారు.
- మరో ఘటనలో ధర్మవరంలోని మారుతీ నగర్‌కు చెందిన మహబూబ్‌పీరా రెండో కుమార్తె నస్రీన్ (19) అనారోగ్య పరిస్థితిని తాళలేక ఆదివారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మహబూబ్‌పీరాకు ముగ్గురు కుమార్తెలు కాగా, ఎలక్ట్రీషియన్ పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రెండో కుమార్తె నస్రీన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులకు తల్లిదండ్రులు వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం టూ టౌన్ పోలీసులు తెలిపారు.

వివాహిత హత్య



పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు పోలీసులు తెలిపిన మేరకు.. పావగడ తాలూకా బుదిబెట్ట గ్రామానికి చెందిన రామాంజినప్ప, లక్ష్మి (32) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మి ఇతరులతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లుగా రామాంజినప్పలో అనుమానాలు మొదలయ్యాయి. ఇదే అంశంపై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఆ సమయంలో పెద్దమనుషులు నచ్చజెప్పి బుద్ధిగా కాపురం చేసుకోవాలని హితవు పలికారు. గత మంగళవారం రాత్రి భర్త నిద్రిస్తుండగా లక్ష్మి తన సెల్‌ఫోన్ ద్వారా ఇతరులతో మాట్లాడసాగింది. విషయాన్ని గమనించిన భర్త తలుపు చాటున ఉంటూ ఆమె మాటలు విన్నాడు. అదే సమయంలో ఎవరితోనో ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తోందన్న అనుమానం ఆయనలో మరింత బలపడి, ఎలాగైనా హతమార్చాలని నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి నిద్రిస్తున్న లక్ష్మిపై రోకలి బండతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మి.. భర్త దాడి నుంచి తప్పించుకుని ఇంటి నుంచి బయటకు పరుగు తీసింది. అయినా విడిచి పెట్టకుండా వెంటాడిన రామాంజినప్ప ఆమెను కిందపడేసి ఓ పెద్ద బండ రాయితో తలపై మోది హతమార్చాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ మాళప్ప నాయ్కోడి కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.

చెరువులో పడి యువకుడి మృతి



హరికృష్ణ(ఫైల్)

అమడగూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమడగూరు మండలం ఎ.కొత్తపల్లి గ్రామ చెరువులో ఆదివారం ఉదయం ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ రాజేంద్రనాథయాదవ్, ఎస్‌ఐ వెంకటనారాయణ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడిని కర్ణాటకలోని ఎల్లంపల్లికి చెందిన హరికృష్ణ (27)గా గుర్తించారు. ఇదే విషయాన్ని హరికృష్ణ కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి నిర్ధారించారు. మతి స్థిమితం లేని హరికృష్ణ నాలుగు రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లాడని, అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం గాలిస్తున్నట్లుగా వారు తెలిపారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నీట మునిగి యువకుడు మృతి



మృతుడు రాజేష్)

రొద్దం: మండలంలోని గొబ్బురంపల్లికి చెందిన అంజినప్ప మూడో కుమారుడు రాజేష్ (23).. అదే గ్రామ సమీపంలోని నల్లకుంట చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయిన రాజేష్ కోసం కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం నల్లకుంట చెరువుచెరువు గట్టుపై దుస్తులు, పాదరక్షలు గుర్తించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రాజేష్ కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చెరువు నీటిలో తేలుగుతున్న మృతదేహాన్ని గుర్తించి, వెలికి తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఘర్షణ

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాలు.. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో నివాసముంటున్న మురళీకృష్ణ, జనార్దన్‌రాజు, శ్రీనివాసులు డీజిల్‌షెడ్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నారు. వీరిలో జనార్దనరాజు, శ్రీనివాసులు అన్నదమ్ములు. వీరికి మురళీకృష్ణకు మధ్య ఇంటి స్థలం విషయంగా కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వివాదానికి కేంద్రమైన స్థలంలో మురళీకృష్ణ వాకిలి పెట్టేందుకు ప్రయత్నించడంతో జనార్దనరాజు, శ్రీనివాసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఆదివారం ఉదయం డీజిల్ షెడ్‌లో విధులుకు హాజరైన ముగ్గురూ వాదులాడుకుంటూ పరస్పరం దాడులకు తెగబడ్డారు. ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తోటి కార్మికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జనార్దనరాజును అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

వన్యప్రాణుల వేటగాడి అరెస్ట్

తలుపుల: మండలంలోని కుర్లి గ్రామానికి చెందిన వన్యప్రాణుల వేటగాడు ప్రతాప్‌ను అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌ఎస్‌ఓ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం వేట కుక్కలతో కలసి వేటకు వెళ్లిన ఆయన ఉడుమును బంధించి వెళుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, ప్రతాప్ తనపై కట్టెతో దాడి చేసి గాయపరిచాడని కుర్లి గ్రామానికి చెందిన హరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్యప్రాణులను వేటాడుతున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో తన ఇంటిపైకి వచ్చి కట్టెతో దాడి చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వేలి ముద్రల ఆధారంగా డబ్బు కాజేశారు



బాధితురాలు సయ్యద్ భాను

పుట్టపర్తి టౌన్: తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.83,760ను సైబర్ నేరగాళ్లు కాజేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేకూరలేదంటూ బాధితురాలు వాపోయింది. వివరాలు.. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన సయ్యద్ భానుకు స్థానిక ఎస్‌బీఐలో ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి విడతలవారీగా రూ.83,760 నగదు మాయమైంది. ఈ విషయాన్ని గుర్తించిన ఆమె నేరుగా బ్యాంక్ అధికారులను కలసి ఆరా తీయడంతో వేలి ముద్రల ఆధారంగా సైబర్ నేరగాళ్లు డబ్బు కాజేసినట్లుగా అనుమానాలు వ్యక్తం చేశారు. కాగా, తాను ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించేకునేందుకు గోకుళంలోని పోస్టాఫీసులోను, వలంటీర్ల వద్దనే వేలి ముద్రలు వేసినట్లుగా బాధితురాలు తెలిపింది. ఇదే విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోక పోవడంతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నేరుగా ఎస్పీ మాధవరెడ్డికి అర్జీ అందజేసినట్లు పేర్కొంది. అయినా తనకు న్యాయం చేకూరడం లేదంటూ బాధితురాలు వాపోయింది.

ఆకాశంలో పాము పడగ



మేఘాల్లో పాము పడగ ఆకారం

హిందూపురం: నియోజకవర్గంలోని చిలమత్తూరు వద్ద ఆకాశంలో పాము పడగ ప్రత్యక్షమైంది. ఆదివారం సాయంత్రం సూర్యాస్తమ సమయంలో మేఘాల్లో పాము పడగ ఆకారం కనిపించడంతో ప్రజలు భక్తి శ్రద్ధలతో నమస్కరించారు. నాగుల చవితి నాడు అరుదైన రూపంలో నాగదేవత కనిపించిందంటూ పూజలు చేశారు.